ఎస్‌ఎల్‌ఎఫ్ డబ్బులు వసూలు చేస్తున్నాడని ఫిర్యాదు

సనత్‌నగర్: డ్వాక్రా రుణాలు పొందాలంటే తనకు ఎంతో కొంత నగదు ముట్టజెప్పాలంటూ ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షుడు హుకుం జారీ చేస్తున్నారంటూ పలువురు డ్వాక్రా మహిళలు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సనత్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళలతో నిర్వహించిన సమావేశంలో పలువురు మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్‌కు విన్నవించారు. ముఖ్యంగా తమకు వచ్చే రుణాల్లో కొంత కమీషన్ రూపంలో ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షుడు డిమాండ్ చేస్తున్నారని వాపోయారు. దీనికి కార్పొరేటర్ స్పందిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన డ్వాక్రా మహిళలు కాయాకష్టం చేసుకుని జీవించేవారని, అలాంటి మహిళల నుంచి నగదు వసూలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, కమ్యూనిటీ ఆర్గనైజర్ మానయ్యలకు సూచించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే పూర్తిగా అధికారులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొలను బాల్‌రెడ్డి, పుష్పలత, రేణుక, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నాడు



నేడు



ఎట్టకేలకు రహదారి పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

ఎట్టకేలకు షాపూర్‌నగర్ రైతుబజార్ వద్ద ఉన్న బస్‌బేలో ఆర్టీసీ బస్సులు ఆగుతుండటంతో ప్రయాణికులు ఊరట లభించింది. రైతు బజారుకు ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్టాప్‌లో బస్‌బే ఛిద్రం కావడంతో బస్సులు నర్సాపూర్ రాష్ట్ర రహదారిపైనే నిలిపేవారు. నిత్యం ఈ రహదారి మీదుగా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో డ్రైవర్లు క్షణాల్లో బస్సులు కదిలించేవారు. సమస్యపై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు ప్రచురితం కావడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. శిథిలమైన బస్‌బేలో సీసీ రోడ్డు వేశారు. –రంగారెడ్డినగర్

మూసాపేటలో సందడి చేసిన హీరో ఆకాశ్



స్టోర్‌ను ప్రారంభించిన ఆకాశ్ పూరి తదితరులు

కూకట్‌పల్లి: తాను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ఆర్సీ ట్రెండ్ సెట్టర్స్ క్లాత్ బ్రాండింగ్ ఫ్యాషన్ స్టోర్‌ను వ్యవస్థాపకులు రమేశ్, రోమన్‌తో కలిసి బుధవారం యంగ్ హీరో ఆకాశ్ పూరి ప్రారంభించారు. ఈ స్టోర్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉందని రమేశ్ తెలిపారు. ఈ క్లాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం సంతోషంగా ఉందని ఆకాష్‌పూరి పేర్కొన్నారు.

ఎంపీ అభ్యర్థి కోసం కాంగ్రెస్ అభిప్రాయ సేకరణ



అభిప్రాయ సేకరణలో పాల్గొన్న బండి రమేశ్ తదితరులు

కూకట్‌పల్లి: గాంధీభవన్ వేదికగా మేడ్చల్–మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోసం బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఏఐసీసీ ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, విష్ణునాథ్, మేడ్చల్, రంగారెడ్డి, సికింద్రాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు బండి రమేశ్, కొలన్ హన్మంతరెడ్డి, తోటకూర వజ్రేష్‌యాదవ్, మైనంపల్లి హన్మంతరావు, వెన్నెల, పరమేశ్వరరెడ్డి తదితరులు అభిప్రాయాలు సేకరించారు.

ఎస్టీపీ ప్లాంట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని ఫతేనగర్, బాలాజీనగర్ డివిజన్‌లలోని రెయిన్‌బో విస్తా, ములకత్వ చెరువు వద్ద చేపట్టిన మురుగునీటి శుద్ధి కేంద్రాల(ఎస్టీపీ) నిర్మాణ పనులను బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సీఎం కేసీఆర్ దాదాపు రూ.400 కోట్ల నిధులు కేటాయించడంతో ఫతేనగర్, బాలాజీనగర్‌లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటవుతున్నాయన్నారు. ప్రస్తుతం వీటి నిర్మాణాలు ప్రస్తుతం పూర్తి కావొచ్చాయని.. ఇవి అందుబాటులోకి వస్తే చెరువు, నాలాలోకి మురుగు నీరు వచ్చే అవకాశమే లేదన్నారు. ఫతేనగర్‌లోని ఎస్టీపీ ప్లాంట్‌కు వెళ్లే రహదారి విస్తీర్ణం పెంచాలని అధికారులకు సూచించారు. అదే విధంగా కాముని చెరువు వద్ద స్థల సేకరణ కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పండాల సతీశ్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి, పగుడాల శిరీష బాబురావు, మాజీ కార్పొరేటర్ బాబురావు, డివిజన్ అధ్యక్షుడు భిక్షపతి, ప్రభాకర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఫౌండేషన్ భవన్‌ను అడ్డుకుంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నిర్మించనున్న ఉస్మానియా ఫౌండేషన్ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటామని ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య బుధవారం పేర్కొన్నారు. విదేశాలలోని పూర్వవిద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూ.150 కోట్ల విలువ చేసే 1.20 (ఎకరం ఇరవై గుంటలు) ఓయూ భూమిలో భవనం నిర్మించడం దారుణమన్నారు. ఏడాదిలో ఎప్పుడో ఒక్కసారి వచ్చే విదేశీ పూర్వ విద్యార్థుల కోసం నగరం నడిబొడ్డున గల కోట్ల విలువ చేసే ఓయూ స్థలాన్ని కేటాయించడం తగదన్నారు. గతంలో రూ.20 కోట్లతో అలూమ్ని భవనం నిర్మాణానికి యత్నించగా విద్యార్థులు అడ్డుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఉస్మానియా ఫౌండేషన్ ద్వారా లభించే విరాళాల నుంచి నిధులను ప్రస్తుతం చదివే పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందజేయాలని డిమాండ్ చేశారు.

'డంపింగ్' దుర్వాసన రాకుండా చూడాలి

జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య



డంపింగ్‌యార్డు వద్ద రాంకీ సంస్థలతో సమావేశమైన జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని డంపింగ్ యార్డును బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య సందర్శించి రాంకీ సంస్థ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు పరిసరాల చుట్టూ దుర్వాసన రాకుండా చూడాలని, రసాయనాలను కాలనీలోకి వదలొద్దన్నారు. చుట్టూ ఉన్న ప్రాంతాలవారికి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం డంపింగ్‌యార్డు సీనియర్ మేనేజర్ సందీప్ మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు పరిసరాల చుట్టూ నూతన టెక్నాలజీతో వాసన రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. క్రమం తప్పకుండా స్ప్రే చేస్తున్నామని, రసాయన నీటిని లిచెట్ ట్రీట్‌మెంట్‌తో మంచినీటిగా మారుస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ సుచరిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

లారీ కింద పడి డెలివరీ బాయ్ మృతి



ఆంజనేయులు కాళ్లు ఛిద్రమైన దృశ్యం

గచ్చిబౌలి: వెనక నుంచి వస్తున్న లారీ కింద పడి ఓ జెప్టో డెలివరీ బాయ్ దుర్మరణం పాలైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీజారెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ్‌పేట జిల్లా, మద్దూర్ మండలం, రేనినట్ల గ్రామానికి చెందిన ఎరుకల ఆంజనేయులు(26) లంగర్‌హౌస్‌లో నివాసం ఉంటున్నాడు. జెప్టోలో డెలివరీ బాయ్‌గా చేస్తున్న ఆంజనేయులు మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో బైక్‌పై గచ్చిబౌలి జంక్షన్ నుంచి మెహిదీపట్నం వైపు వెళుతుండగా గచ్చిబౌలిలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ముందు వెనక నుంచి ఆక్సిజన్ సిలిండర్ల లోడ్‌తో వస్తున్న లారీ కిందపడ్డాడు. ముందు చక్రాలు రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో ఛిద్రమయ్యాయి. వెంటనే కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బేగంపేట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటలకు మృతి చెందాడు. ముందు వాహనాన్ని తప్పించబోయి పడిపోయాడా లేక లారీ ఢీకొట్టిందా అనేది తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీరాంనగర్ బస్తీ సమస్యలు పరిష్కరించండి

రహమత్‌నగర్: శ్రీరాంనగర్ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. నాయకులు ఎక్బాల్, ఇంతియాజ్ ఖాన్, లింగమూర్తి, వినోద్‌కుమార్ పాల్గన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

నోడల్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ గౌతమ్

సాక్షి,మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవటంతోపాటు ముందస్తు కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని నోడల్ అధికారులను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్నికల నోడల్ అధికారులతో లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో అన్ని విభాగాల నోడల్ ఆఫీసర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ.. ఎలాంటి లోపాలు తలెత్తకుండా విధులను నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది డేటా నమోదు పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు కావాల్సిన సామాగ్రి సేకరణ కూడా పూర్తి చేయాలని సూచించారు. పోలీసు బందోబస్తు పకడ్బందీగా చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంతోపాటు ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటుపై కార్యాచరణ కార్యక్రమాన్ని ఖరారు చేయాలన్నారు. వాహనాలకు జీపీఎస్ సిస్టం అమర్చి, వాటిని ట్రాక్ చేయాలన్నారు. స్వీప్ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. ఎన్నికల ఖర్చు నియంత్రణపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్‌ఎస్టీ, వీవీటీల ఏర్పాటు చేసి, శిక్షణ ఇవ్వాలన్నారు. క్లిష్టమైన పోలింగ్ బూతుల జాబితాను తయారు చేసి పోలీస్ బందోబస్తు పటిష్టపరచాలన్నారు. ఫారం 12 –డిని ముందుగానే అవసరమైన ఓటర్లకు అందజేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా పెయిడ్ న్యూస్, ప్రకటనల ఖర్చును వ్యయనియంత్రణ కమిటీకి ఎప్పటికప్పుడు పంపాలన్నారు. ప్రెస్ మీట్ల నిర్వహణకు సమాచార లోపం లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, నోడల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆలయ ముఖ ద్వారం ప్రారంభం



కూకట్‌పల్లి: చిత్తారమ్మ ఆలయ ముఖ ద్వారాలను బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తులసిరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభం



డ్రైనేజీ లైన్లను ప్రారంభించిన కార్పొరేటర్ శిరీష తదితరులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నంబర్ 2, విజయదుర్గ సెంటర్ వద్ద భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రాంతాల్లో వర్షాకాలంలో తరచూ మురుగు నీరు పొంగుతోందని, సమస్య పరిష్కారం కోసం భూగర్భ డ్రైనేజీ లైన్ల పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ కుమారి వైష్ణవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, నాయకులు వెంకటేశ్, పవన్‌కుమార్, సుభాష్‌గౌడ్, ఆరోగ్యరెడ్డి, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి

డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న జోన్ ఎస్‌డబ్ల్యూఎం డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

శేరిలింగంపల్లి: స్వచ్ఛ ఆటోల ద్వారా ఇళ్లు, షాపుల నుంచి చెత్తను సేకరించాలని శేరిలింగంపల్లి జోన్ సాలిడ్ వేస్ట్ మేనేజమెంట్ డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం శేరిలింగంపల్లి సర్కిల్ శానిటేషన్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చెత్తను రోడ్లపై వేయకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. శానిటేషన్‌పై ఫిర్యాదులు వస్తే 24 గంటల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తపై అపార్టుమెంట్ల వాసులకు అవగాహన కల్పించాలని, ఎస్‌ఎఫ్‌ఏలు బాధ్యత తీసుకోవాలన్నారు. గార్బేజ్ వనరబుల్ పాయింట్స్‌ను గుర్తించి 15 రోజుల్లో వాటిని తొలగించాలని, లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్కిల్ ఉపవైద్యాధికారి నగేష్ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీలు, ఎస్‌ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన అవసరం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

గాంధీఆస్పత్రి : నీటికాసుల వ్యాధిగా పిలవబడే గ్లకోమా రుగ్మతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు అన్నారు. ప్రపంచ గ్లకోమా నివారణ వారోత్సవాల్లో భాగంగా గాంధీ ఆప్తమాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పలు అవగాహన కార్యక్రమాలు, చైతన్యర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రాజారావు, ఆప్తమాలజీ హెచ్‌ఓడీ రవిశేఖర్‌రావు మాట్లాడుతూ..గ్లకోమా అనేది ఒక రకమైన కంటి వ్యాధి, ఏ వయసు వారికైన రావచ్చు.. 60 ఏళ్లు పైబడిన వారిలో గ్లకోమాతో అంధత్వం వచ్చే అవకాశాలు ఎక్కువని స్పష్టం చేశారు. తలనొప్పి, కంటినొప్పి, వాంతులు, వికారం, దృష్టి మందగించడం, కంటి చికాకు తదితర లక్షణాలు ఉంటే గ్లకోమాగా భావించాలన్నారు. స్వీయరక్షణ, జీవనశైలిలో మార్పులతో గ్లకోమా వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. గ్లకోమా నివారణ, నియంత్రణకు గాంధీ ఆప్తమాలజీ విభాగంలో నిష్ణాతులైన వైద్యులు, అన్నిరకాల వైద్య సేవలు, శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలజీ, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీలు రవిశేఖర్‌రావు, సుబోధ్‌కుమార్, ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, ఆప్తమాలజీ వైద్యులు ప్రావీణ్య, సృజనీ, సింధు, ప్రకాశ్, పాల్గొన్నారు.

పీఎం సూరజ్ పోర్టల్'లో కలెక్టర్



సాక్షి, మేడ్చల్ జిల్లా: సామాజిక అభ్యున్నతి అండ్ ఆధారిత ప్రజా సంక్షేమం పీఎం సూరజ్ పోర్టల్‌ను బుధవారం ఆన్‌లైన్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు. పీఎం సూరజ్ పోర్టల్ ద్వారా ప్రధానమంత్రి రూ. లక్ష ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు రుణ వితరణ కింద అందజేయటం జరిగింది. సఫాయి కార్మికులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు మంజూరు చేశారు. ఈ కార్డుల ద్వారా రూ.ఐదు లక్షల వరకు ఆరోగ్య బీమా అందరి కార్మికులకు వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సంజయ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యలను అశ్రద్ధ చేయొద్దు



మాట్లాడుతున్న నైతిక్

సనత్‌నగర్: వినికిడి సమస్యల విషయంలో అశ్రద్ధ చేయవద్దని, వాటిని అధిగమించేందుకు ఆధునికంగా ఎన్నో ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయని ఆరా హియరింగ్ అండ్ స్పీచ్ కేర్ సీఈఓ నైతిక్ తెలిపారు. సిగ్నియా భాగస్వామ్యంతో పంజగుట్టలో ఆరా హియరింగ్ అండ్ స్పీచ్ కేర్‌ను ప్రారంభించిన సందర్భంగా బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆడియో మెట్రీ, టిమ్పానోమెట్రీ, వినికిడి సహాయ ట్రయల్, ఫిట్టింగ్, ప్రోగ్రామింగ్, సర్వీసింగ్ వంటి ప్రత్యేక సేవలతో పాటు అనేక రకాల ఉపకరణాలతో పాటు సమగ్రమైన ఆడియోలాజికల్ సేవలను అందించడం జరుగుతుందన్నారు. వినికిడి అనేది జీవితంలోని ఏ దశలోనైనా ఎవరినైనా ప్రభావితం చేయగలదన్నారు. భారతదేశ జనాభాలో దాదాపు ఆరు శాతం మంది వివిధ స్థాయిల్లో వినికిడి లోపంతో బాధపడుతున్నారని పరిశోధనలు సూచిస్తున్నాయన్నారు. సకాలంలో స్పందించకుంటే శారీరక, సామాజిక సవాళ్లకు దారి తీస్తుందన్నారు. ఆరాలో అర్హత కలిగిన ఆడియోలజిస్టులు వినికిడి లోపం, లక్షణాలు, కారణాలను పరిశోధించడంలో సహాయం చేస్తారన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేసిన శ్రీకాంత్ తదితరులు

బాలానగర్: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పులి అండాళమ్మ పటేల్ పదో వర్ధంతి సందర్భంగా బుధవారం ఆమె కుమారుడు శ్రీకాంత్ పటేల్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్‌లో గత ఏడాది పదో తరగతిలో ర్యాంకు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ విచ్చేసి విద్యార్థులకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ.2,500 అందజేసి సన్మానించారు. అదే విధంగా పరీక్ష ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో పుష్పరెడ్డి, కూన రవీందర్ గౌడ్, కొప్పిశెట్టి దినేశ్‌కుమార్ గౌడ్, శేరి సతీశ్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, విఠల్‌రెడ్డి, కుమార్ గౌడ్, లక్ష్మయ్య, పులి శ్రీకాంత్, శివ చౌదరి, కూన భరత్‌గౌడ్ సదానందం, దండు రవి, రవి ముదిరాజ్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి

ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



ప్రొఫెసర్ కాత్యాయని విద్మహేను సన్మానిస్తున్న వీసీ సీతారామారావు

బంజారాహిల్స్: మహిళలకు విద్య, రాజకీయాల్లో జనాభా దామాషా పద్ధతిలో సరైన వాటా దక్కలేదని ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ మహిళా అభివృద్ధి, విస్తరణ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమానికి తెలంగాణ ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక కార్యదర్శి, కాకతీయ విశ్వవిద్యాలయ తెలుగు విశ్రాంత అధ్యాపకురాలు ఆచార్య కాత్యాయని విద్మహే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆమె ఈ సందర్భంగా 'మహిళా శక్తి: మహిళల హక్కులు' అనే అంశంపై ప్రసంగించారు. అనేక సంవత్సరాలుగా అంతర్జాతీయ మహిళలకు హక్కుల ఉద్యమం చేసిన గొప్ప చరిత్ర ఉన్నప్పటికీ, ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా భ్రూణ హత్యలు, బాలికలను హరించడం, లైంగిక బానిసలుగా వాడుతుండటం దుర్మార్గమైన చర్యగా ఆమె అభివర్ణించారు. మహిళల మానవ హక్కులు, మహిళా సాధికారత, లింగ సమానత్వం–హక్కులను పరిరక్షించడం, రాజకీయ ప్రాతినిధ్యం మొదలుకొని అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. న్యాయం జరగనప్పుడు ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన బాధ్యత కూడా మహిళలు, మహిళా సంఘాలపై ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.సీతారామారావు మాట్లాడుతూ... ప్రపంచంలో స్త్రీని మించిన మహాశక్తి ఏదీ లేదని, స్త్రీ లేకపోతే ఈ సృష్టి లేదన్నారు. మహిళల సాధికారత, అభ్యున్నతి, వివక్ష నిర్మూలనపై తమ విశ్వవిద్యాలయం ద్వారా పాఠ్యాంశాలను అందిస్తున్న విషయాన్నిగుర్తుచేశారు. రానున్న రోజుల్లో మహిళా సాధికారతకు సంబంధించి తమ విశ్వవిద్యాలయం పెద్దపీట వేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, మహిళా అభివృద్ధి, విస్తరణ కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ మేరీ సునంద తదితరులు పాల్గొన్నారు.

'కేఎల్' యూనివర్సిటీకి 'ఎక్సలెన్స్' అవార్డు

బంజారాహిల్స్: ఇటీవల న్యూ ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగిన 12వ గ్రీన్ ఎనర్జీ సమ్మిట్, నాల్గో గ్రీన్ ఉర్జా అండ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డ్స్‌లో కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ అకాడెమియా ఎక్సలెన్స్ అవార్డును కైవసం చేసుకుంది. దీంతో పాటు స్కిల్ డైవర్సిటీ అండ్ ఔట్ రీచ్ విభాగంలో 'విజేత అవార్డు'ను అందుకుంది. ఇంధన పొదుపు, పునరుత్పాదక శక్తి, సంబంధిత రంగాలను అభివృద్ధి చేయడంలో చేసిన కృషికి గాను ఈ గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు పునరుత్పాదక ఇంధన పరిష్కారాల వైపు ప్రపంచ మార్పుపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జి.పార్థసారథివర్మ మాట్లాడుతూ... ప్రతిష్టాత్మక గుర్తింపు తమ సంస్థ అంకితభావానికి నిదర్శనమన్నారు. భారత ప్రభుత్వం మాజీ సెక్రటరీ పవర్ అనిల్ రజ్దాన్, రిటైర్డ్ ఐఏఎస్ అలోక్‌కుమార్, న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డైరెక్టర్ సుమన్ చంద్ర చేతుల మీదుగా యూనివర్సిటీ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ వీ రాజేష్ ఆ సంస్థ తరఫున అవార్డును స్వీకరించారు.